సాక్షి నంద్యాల

శనివారం । 30 । సెప్టెంబర్ । 2023



రూ.33.43లక్షల ఆదాయం

మహానంది: మహానంది ఆలయంలో నిర్వహించిన హుండీ కానుకల లెక్కింపు ద్వారా రూ.33.43లక్షలు వచ్చినట్లు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.



అహోబిలంలో పౌర్ణమి పూజలు

ఆళ్లగడ్డ: అహోబిలం లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శుక్రవారం విశేష పౌర్ణమి పూజలు నిర్వహించారు. స్వామి ఉభయ దేవేరులతో విహరిస్తూ భక్తులకు కనువిందు చేశారు.



రూ.2లక్షల విరాళాలు

శ్రీశైలం టెంపుల్: హైదరాబాద్‌కు చెందిన జి.ఉమారెడ్డి అన్నప్రసాద వితరణకు రూ.1,01,116, గోసంరక్షణ నిధి పథకానికి జి.మౌనికారెడ్డి రూ.1,01,116 విరాళాన్ని అందజేశారు.

న్యూస్‌రీల్

మహానందీశ్వరుడి సన్నిధిలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ రాజశేఖరరావుకు జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం

మహానంది: మహానందీశ్వరుడి సన్నిధిలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి టి.రాజశేఖరరావు దంపతులు శుక్రవారం రాత్రి పూజలు నిర్వహించారు. మహానందీశ్వరస్వామి దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. స్థానిక అలంకార మండపంలో స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదపండితుల ఆశీర్వచనాలు చేయించారు.

శ్రీశైలం నుంచి 10వేల క్యూసెక్కుల నీటి విడుదల

శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయం నుంచి గత గురువారం నుంచి శుక్రవారం వరకు 9,859 క్యూసెక్కుల నీరు దిగువ ప్రాంతాలకు విడుదలైంది. భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో 2.449 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. అనంతరం నాగార్జునసాగర్‌కు 4,279 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బ్యాక్ వాటర్ నుంచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ ద్వారా 2,500 క్యూసెక్కులు, హంద్రీనీవా సుజలస్రవంతికి 1,505, కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 1,466 క్యూసెక్కుల నీరు విడుదలైంది. శుక్రవారం సాయంత్రానికి ఎగువ ప్రాజెక్టులైన జూరాల, సుంకేసుల నుంచి శ్రీశైలానికి 4,4,46 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది.

పింఛన్ల పంపిణీకి రూ.130.36 కోట్లు విడుదల

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్సార్ పెన్షన్ కానుక కింద అక్టోబర్ నెల పింఛన్ల పంపిణీకి ఉమ్మడి కర్నూలు జిల్లాకు ప్రభుత్వం రూ.130,36,34,750 విడుదల చేసింది. కర్నూలు జిల్లాలో 2,47,011 పింఛన్లు ఉండగా రూ.68,71,25,00, నంద్యాల జిల్లాలో 2,23,208 పింఛన్లకు రూ.61,,65,09,750 ప్రకారం నిధులు విడుదలయ్యాయి. వెల్ఫేర్ అసిస్టెంట్లు శనివారం బ్యాంకుల నుంచి నగదు డ్రా చేస్తారు. అక్టోబర్ 1వ తేదీ ఉదయం నుంచి 5 రోజుల పాటు పంపిణీ కొనసాగుతుంది.

కాన్వొకేషన్ దరఖాస్తుకు నేడు ఆఖరు

కర్నూలు(న్యూసిటీ): రాయలసీమ విశ్వవిద్యాలయంలో నాల్గవ కాన్వొకేషన్ దరఖాస్తుకు శనివారం వరకు గడువు ఉందని ఉపకులపతి ఆచార్య ఎ.ఆనందరావు తెలిపారు. ఇంకా దరఖాస్తు చేసుకొని విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించి నమోదు చేసుకోవాలన్నారు. సాంకేతిక సమస్యలు ఉంటే విద్యార్థులు సాయంత్రం 5 గంటల్లోపు యూనివర్సిటీ అధికారులను సంప్రదించాలని పేర్కొన్నారు.

తలానీలాల వేలంలో రూ.1.85 కోట్ల ఆదాయం

బేతంచెర్ల: వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్లకు భక్తులు సమర్పించే తలనీలాల బహిరంగ వేలంలో రూ.1.85 కోట్ల ఆదాయం వచ్చింది. శుక్రవారం దేవదాయ శాఖ తనిఖీ అధికారి మద్దిలేటి పర్యవేక్షణలో 7వ సారి నిర్వహించిన బహిరంగ వేలం పాటలో చాగలమర్రి మండలానికి చెందిన వెంకట నరసమ్మ రూ.1,85,25,000 హెచ్చు పాట పాడి దక్కించుకున్నట్లు ఆలయ ఈఓ పాండు రంగారెడ్డి, చైర్మన్ రామచంద్రుడు తెలిపారు.

గురుకుల పాఠశాల పరిశీలన



డిజిటల్ క్లాసులను పరిశీలిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి కృష్ణమోహన్

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం మహాత్మాజ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలను శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి కృష్ణమోహన్ పరిశీలించారు. పాఠశాల ప్రాంగణంలోని అన్ని విభాగాలను తనిఖీ చేశారు. తరగతి గదులు, హాస్టల్‌ను పరిశీలించారు. విద్యార్థులతో సమావేశమై పాఠశాలలో అందుతున్న విద్య, సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. బైజూస్ కాంటెంట్ కలిగిన ఇంట్రాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్‌లను తనిఖీ చేసి డెమో క్లాసులను విన్నారు. పాఠశాల రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాల సిబ్బంది మధ్య సమన్వయం బాగుందని అభినందించారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ జవహర్ ఉన్నారు.

ఆరోగ్యమే సంపాదన

మారుతున్న జీవనశైలి

- విద్య తర్వాత ఆహారం, ఆరోగ్యానికి అధిక శాతం ఖర్చు
- మిల్లెట్స్, న్యూట్రిషన్ ఫుడ్ వాడకంపై ప్రధాన దృష్టి
- ఆహారం విషయంలో రాజీపడని సామాన్య, మధ్య తరగతి కుటుంబాలు
- చదువుకునే వారి సంఖ్య పెరగడమే చైతన్యానికి కారణం
- పోషకాహారలోపంతో బాధపడుతోన్న వారి సంఖ్యలో భారీ తగ్గుదల
- పండ్లు, గుడ్లు, మాంసంతో పాటు పోషకాహారానికి ప్రాధాన్యం

సాక్షి ప్రతినిధి కర్నూలు: పోషకాహార లోపంతో బాధపడే ప్రాంతాల్లో మనది కూడా ఒకటి. ముఖ్యంగా పేదరికం అత్యధికంగా ఉండే పశ్చిమ ప్రాంతంలో ఈ పరిస్థితి మరీ ఎక్కువ. బతకడం కోసం మరో ప్రాంతానికి వెళ్లి ఒళ్లు హూనమయ్యేలా శ్రమించి తినీతినక ప్రతి రూపాయి దాచుకొని బతుకీడ్చేవారు. ఇక్కడ పౌష్టికాహారం, సౌకర్యవంత జీవనం అనే మాటలకు చోటే లేదు. అక్షరాస్యత వెనుకబాటులో దేశంలోనే మూడోస్థానంలో కోసిగి మండలం ఉంది. 40శాతంలోపు 10 మండలాలు, 50శాతంలోపు 19 మండలాలు ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉన్నాయంటే ఇక్కడ వెనుకబాటుతనం ఏంటో ఇట్టే తెలుస్తుంది. ప్రస్తుతం పరిస్థితి మారింది. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో ప్రతీ ఇంటికి ఆర్థిక భరోసా లభిస్తోంది. వారి కష్టానికి ప్రభుత్వ సాయం దన్నుగా నిలుస్తోంది. దీంతో పిల్లలకు మంచి చదువులు చదివిస్తున్నారు. అక్షరాస్యత పెరగడంతో ప్రజల్లో చైతన్యం కూడా అధికమైంది. జీవన విధానంలో ప్రాధాన్యతలు గ్రహిస్తున్నారు. ఆరోగ్యంగా ఉండాలంటే మంచి ఆహారం తీసుకోవాలనే భావనకు వచ్చారు.

ఆరోగ్యానికీ ప్రాధాన్యత


ప్రతి వందమందిలో 63శాతం మంది జీవనశైలి వ్యాధులతోనే మృతి చెందుతున్నారని డబ్ల్యూహెచ్‌ఓ చెబుతోంది. 2030కి ప్రతి ముగ్గురిలో ఒకరు జీవనశైలి వ్యాధులతో చనిపోతారని స్పష్టం చేసింది. ఎన్‌సీడీ(నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్) వ్యాధుల బారిన పడుతున్నారు. 35 ఏళ్లదాటితే హైపర్‌టెన్షన్, జీర్ణ సమస్యలు, షుగర్, బీపీ వస్తున్నాయి. ఆశ్చర్యమేంటంటే 18 ఏళ్లు దాటిన వారు కూడా ఎన్‌సీడీ బారిన పడుతున్నారు. దీంతో అందరిలోనూ ఆరోగ్యంపై జాగ్రత్త పెరిగింది. మంచి ఆహారం, వ్యాయామంపై దృష్టి సారిస్తున్నారు. అందుకే జిమ్‌లు, ఫిట్‌నెస్, జుంబా సెంటర్లకు వెళ్తున్నారు. పిల్లలను ఏదో ఒక స్పోర్ట్‌లో చేర్పిస్తే శారీరంగా, మానసింగా ఆరోగ్యంగా ఉంటారని స్పోర్ట్స్‌వైపు పంపుతున్నారు.

ప్రపంచం మారుతోంది. ఆర్థికంగా ప్రతీ కుటుంబం బలపడుతోంది. జీవన విధానంలో కూడా భారీ మార్పులు చోటు చేసుకుంటున్నాయి. సంపాదనలో దాచుకునే కాలం నుంచి సంపాదించిన సొమ్ములో సంతోషంగా జీవించడానికి సరిపడా ఖర్చు చేసి మిగిలిందే దాచుకుందాం అనే ధోరణి కనిపిస్తోంది. సంపాదనలో అత్యధిక శాతం విద్య, ఆహారం, ఆరోగ్యానికి మాత్రమే ఖర్చు చేస్తున్నారు. పిల్లలకు మంచి చదువు ఇస్తే చాలు అదే వాళ్లకు ఆస్తి అనే భావనతో చాలా మంది విద్య విషయంలో రాజీ పడటం లేదు. ఆ తర్వాత మంచి పోషకాహారం, ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. కోవిడ్ తర్వాత వీటిపై ప్రజల్లో మరింత చైతన్యం పెరగడం విశేషం.



> స్త్రీ, శిశు సంక్షేమశాఖ లెక్కల ప్రకారం వయస్సుకు తగ్గట్లు బరువు ఉన్నవారు 2019కి ముందు 90 శాతంలోపు ఉంటే 2022లో 93.82 శాతం ఉన్నారు. 2023లో 94.15 శాతంఉన్నారు. దీన్నిబట్టే పోషకాహారలోపంతో బాధపడేవారి సంఖ్య తగ్గుతోందని స్పష్టమవుతోంది.

పోషకాహారం కోసం ఖర్చులో తగ్గేదేలే..



10–15ఏళ్ల కిందట కిరాణా మినహా ఏదైనా పండ్లు, ఇతర ఆహార పదార్థాలు కొనాలంటే జేబులో డబ్బులు చూసేవారు. సామాన్య, మధ్య తరగతి కుటుంబాలు ఆహారం మినహా ప్రత్యేకంగా పండ్లు, మాంసంపై దృష్టి సారించేవారు కాదు. పండుగలు, బంధువులు ఇంటికి వచ్చిన సందర్భాల్లోనే నాన్‌వెజ్ ఉండేది. ఇప్పుడు ప్రతీవారం కచ్చితంగా, కొందరు వారంలో 2, 3 సార్లు నాన్‌వెజ్ తీసుకుంటున్నారు. అలాగే డ్రైఫ్రూట్స్ వాడకం గణనీయంగా పెరిగింది. చాలామంది బాదం, పిస్తా, ఖర్జూర, కాజు, ఆఫ్రికాట్స్‌తో పాటు పలు రకాల డ్రైఫ్రూట్స్ కొంటున్నారు. పిల్లలకు రోజూ డ్రైఫ్రూట్స్ ఇస్తే పటిష్టంగా ఉంటారనే భావనకు వచ్చారు. ఏదైనా బేకరీ, డ్రైఫ్రూట్స్ లేదా మరో దుకాణానికి వెళితే ధరలు అడగకుండా కావల్సింది తీసుకుని బిల్లు చూసి ఫోన్‌పే చేసి వస్తున్నారు. దీంతో పాటు మిల్లెట్స్ వినియోగం కూడా పెరిగింది. కొర్రలు, అరికెలు, కినోవాతో పాటు మిల్లెట్స్ తినేవారి సంఖ్య కూడా క్రమంగా పెరుగుతోంది. ఇవన్నీ పోషకాహారం తీసుకోవడంలో భాగమే. వీటన్నిటి కంటే ప్రధానమైంది మాంసాహారం. వారంలో ఒకరోజు.. కనీసం నెలలో ఒక రోజు ఫ్యామిలీతో రెస్టారెంట్లకు వెళ్లే సంస్కృతి పెరిగింది.

ప్రతీ నెలా నాన్‌వెజ్ ఖర్చు రూ.240కోట్లు



దేశంలోని 29 రాష్ట్రాల్లో మాంసాహార వినియోగంలో తెలంగాణ మొదటి స్థానంలో ఉంది. ఇక్కడ 98.4శాతం పురుషులు, 98.1శాతం స్త్రీలు మాంసాహారం తీసుకుంటారు. ఆ తర్వాత పశ్చిమ బెంగాల్, మూడోస్థానంలో ఆంధ్రప్రదేశ్ ఉంది. చివరిస్థానంలో రాజస్తాన్ ఉంది. అయితే ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్–5(నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే) ప్రాంతాల వారీగా 33,755 మంది స్త్రీలు, 5,048 మంది పురుషులతో 2019–20లో సర్వే నిర్వహించింది. ఇందులో మహిళలు 71.8శాతం, పురుషులు 83.2శాతం మాంసాహారం తీసుకుంటున్నట్లు తేలింది. కోవిడ్ తర్వాత ప్రతీ జిల్లాలో మాంసాహార వినియోగం అధికమైంది. రోగనిరోధకశక్తి పెరుగుతుందనే భావనతో మాంసాహారాన్ని అధికంగా తీసుకుంటున్నారు. పశుసంవర్ధకశాఖ అధికారుల గణాంకాల ప్రకారం ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రతి నెలా 5వేల మెట్రిక్ టన్నుల మాంసాహారం వినియోగిస్తున్నారు. ఇందులో 2,400 టన్నులు చికె...న్, 1600 టన్నులు చేపలు, 1400 టన్నుల మటన్ ఉంటోంది. దీనికి నెలకు రూ.209కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఇవి కాకుండా కోడిగుడ్లు, బీఫ్, పోర్క్, కంజు ఇతర మాంసాహార ఖర్చులు లెక్కిస్తే నెలకు రూ.240కోట్లు మాంసాహారానికి ఖర్చు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆహారానికి ప్రాధాన్యత ఇవ్వడంలో పోషకాహారలోపంతో బాధపడేవారి సంఖ్య కూడా క్రమేణా తగ్గుతోంది.

అవగాహన పెరిగింది



కరోనా తర్వాత స్వల్ప రోగాలకు, వైరస్‌లను తట్టుకునేలా ఆహారంలో మార్పులు చేసుకుంటున్నాం. అందరిలోనూ దీనిపై అవగాహన పెరిగింది. హోటల్స్, రెస్టారెంట్లు పెరగడమే ఇందుకు తార్కాణం. ఆహారం విషయంలో ఖర్చుకు ఎవరూ వెనుకాడటం లేదు.

– డాక్టర్ బి.సునిత, హ్యుమానిటీస్ విభాగాధిపతి, జి.పుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల, కర్నూలు

మాంసాహారం తప్పనిసరి



మాంసాహారం లేనిది పిల్లలు భోజనం చేయడం లేదు. మా తరంతో పోలిస్తే పూర్తిగా ఆహార అలవాట్లు మారాయి. పోషకాహారం తీసుకోవడంపై అందరిలో చైతన్యం పెరిగింది. న్యూట్రిషన్లతో కూడిన ఆహారం తీసుకునేందుకే అందరూ ఇష్టపడుతున్నారు.

– డాక్టర్ జె.ఉషశ్రీ, వైస్ ప్రిన్సిపల్, రవీంద్ర మహిళా ఇంజనీరింగ్ కళాశాల, కర్నూలు

పోషకాహారంపై శ్రద్ధ



గ్రామీణ ప్రాంత ప్రజలు సైతం పోషకాహంరంపై అవగాహన పెంచుకుంటున్నారు. గతంలో 50 శాతం మాత్రమే డైట్ గురించి అడిగేవారు. ఇప్పుడు 70 నుంచి 80 శాతం మంది డైట్ గురించి తెలుసుకుంటున్నారు. తాజా పండ్లతో పాటు తృణధాన్యాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు.

– డాక్టర్ ఎ.రవీందర్, డైటీషియన్, కర్నూలు

మాటకు కట్టుబడి సాయం



వాహన మిత్ర లబ్ధిదారులకు చెక్కును విడుదల చేస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా తదితరులు

- ఐదో విడత వాహనమిత్రకు రూ. 8.89 కోట్లు విడుదల

నంద్యాల: ఆటో డ్రైవర్ల ఇబ్బందులను పాదయాత్రలో గుర్తించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక సాయమందించి అండగా నిలుస్తున్నారని నంద్యాల ఎంపీ పోచాబ్రహ్మానంద రెడ్డి, ఎమ్మెల్యే ఇసాక్‌బాషా, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, రాష్ట్ర మైనార్టీ ప్రభుత్వ సలహాదారు హబీబుల్లా అన్నారు. వైఎస్సార్ వాహన మిత్ర పథకం కింద ఐదో విడత సాయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ శుక్రవారం విజయవాడ నుంచి బటన్ నొక్కి నగదును లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. కార్యక్రమాన్ని నంద్యాల కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్సీలు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 8,892 మంది లబ్ధిదారులకు రూ.8,89,20,000 వారి ఖాతాల్లో జమ చేశారన్నారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం చేసిన దాఖలాలు లేవన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ప్రతి ఏటా రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందించడం ఓ చరిత్రగా అభివర్ణించారు.

- జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, రాష్ట్ర మైనార్టీ సలహాదారు హబీబుల్లా మాట్లాడుతూ పార్టీలకతీతంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వాహనమిత్ర పథకాన్ని అమలు చేశారన్నారు. ఐదు విడతలు నిధులు మంజూరు చేశారన్నారు.
- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ మాట్లాడుతూ వాహన మిత్ర సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.
- డీటీఓ శివారెడ్డి, రాష్ట్ర దృశ్య కళల డైరెక్టర్ సునిత అమృతరాజ్, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

జగనన్నకు రుణపడి ఉంటాం



ప్రతి ఏటా క్రమం తప్పకుండా రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న ముఖ్యమంత్రికి ఆటో డ్రైవర్లమంతా రుణపడి ఉంటాం. ఆటోల మరమ్మతుకు, ఇతర అవసరాలకు ఈ డబ్బు ఉపయోగపడుతుంది. అమ్మ ఒడి కింద రూ.13వేలు, వైఎస్సార్ చేయూత కింద రూ.18,750 ప్రతి ఏడాది మా ఖాతాల్లో జమ చేస్తున్నారు.

– భీమ్‌రాజ్, ఆటోడ్రైవర్, నెరవాడ, పాణ్యం

క్రమం తప్పకుండా డబ్బు జమ



1998 సంవత్సరం నుంచి ఆటో నడుపుతున్నా. ఏ ప్రభుత్వం కూడా మమ్మల్ని ఆదుకోలేదు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యాక ఏడాదికి రూ.10వేలు చొప్పున క్రమం తప్పకుండా మా ఖాతాల్లో జమ చేస్తున్నారు. మా బాధలు కళ్లారా చూసి ఆయన స్పందిస్తున్న తీరు ఎప్పటికీ మర్చిపోలేం.

– వెంకటేశ్వర్లు, ఆటోడ్రైవర్, నంద్యాల

రూ. 10 లక్షలతో నిశ్చితార్థ మండపం

మహానంది: మహానందిలో ఏటా మహాశివరాత్రి పర్వదినాన జరిగే కల్యాణోత్సవానికి సంప్రదాయంగా వస్తున్న నిశ్చితార్థం వేడుకలకు నూతన మండపాన్ని నిర్మించేందుకు దాతలు ముందుకొచ్చినట్లు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మహానందీశ్వరస్వామి తరపున పెళ్లిపెద్దలైన గుండంపాడు, కామేశ్వరీదేవి అమ్మవారి తరపున ఉన్న గుండుపాపలకు చెందిన పెద్దలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ మేరకు ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి వారితో వివిధ అంశాలపై మాట్లాడారు. గతంలో ఉన్న పురాతన మండపాన్ని తొలగించామని, ఆ స్థానంలో దాతల సహకారంతో రూ.10 లక్షలతో నూతన నిశ్చితార్థ మండపాన్ని త్వరలోనే ప్రారంభించి శివరాత్రికి పూర్తి చేస్తామన్నారు.

ప్రజల చెంతకే ఆరోగ్య సేవలు

- నేటి నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

నంద్యాల టౌన్: పాలనలో నూతన సంస్కరణలతో ప్రజలకు చేరువవుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మరో బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలనే సత్సంకల్పంతో జగనన్న ఆరోగ్య సురక్ష పేరిట వినూత్న కార్యక్రమం అమలు చేస్తున్నారు. గ్రామాలు, వార్డుల వారీగా ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి వివిధ రకాల రోగాలతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. అందులో భాగంగా ఈనెల 30 నుంచి జిల్లా వ్యాప్తంగా 516 సచివాలయాల పరిధిలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించారు.

ఐదు దశల్లో ఆరోగ్య సురక్ష

తొలిదశలో వలంటీర్లు, గృహసారథులు, ప్రజాప్రతినిధులు ప్రతి ఇంటినీ సందర్శించారు. ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించే తేదీతో పాటు ఏయే కార్యక్రమాలు చేపడతామో వివరించారు. ఆరోగ్యశ్రీ పథకంలో ఉన్న ఆస్పత్రుల వివరాలు, పథకాన్ని ఎలా వినియోగించుకోవాలనే అంశాలపై అవగాహన కల్పించారు. తర్వాతి దశలో ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, ఆ ఏరియా వలంటీర్లతో కలిసి ప్రతి ఇంటికీ వెళ్లి ఏడు రకాల పరీక్షలకు సంబంధించిన వివరాలను ప్రజలకు వివరిస్తారు. పరీక్షలు నిర్వహిస్తూ వివరాలను మొబైల్ యాప్‌లో నమోదు చేస్తారు. ఇలా ప్రతి ఇంటికీ, పేషెంట్‌కి ఒక కేస్‌షీట్ ఇస్తారు. మూడో దశలో సచివాలయాలు, ఆరోగ్య కేంద్రాలవద్ద ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించే తేదీ, వేదికలను మరోసారి వలంటీర్, ఏఎన్‌ఎం, ప్రజా ప్రతినిధులు తెలియజేస్తారు. నాలుగో దశలో వైద్య శిబిరాలు నిర్వహించి ఉచితంగా మందులు అందిస్తారు. ఎవరికైనా మెరుగైన వైద్యం అవసరమని భావిస్తే వారిని ఆరోగ్యశ్రీ అనుపత్రులకు పంపుతారు. ఐదో దశలో రోగులకు ఆరోగ్యశ్రీ ద్వారా నాణ్యమైన సేవలు అందుతున్నాయ, లేదా అనే విషయాన్ని వైద్య అధికారులు పర్యవేక్షిస్తారు.

నిర్వహించిన వైద్య పరీక్షలు

షుగర్	1,54,751
బీపీ	1,77,178
యూరిన్ టెస్ట్	4831
హిమోగ్లోబిన్	2,20,171
మలేరియా	2047
డెంగీ	952
కఫం	3100

సద్వినియోగం చేసుకోవాలి

రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. కార్పొరేషన్ పరిధిలోని ప్రతి కుటుంబ సభ్యుడి వివరాలు నమోదు చేసుకోవడంతో పాటు వారికి ఏడు రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నాం. పరీక్షల్లో వివిధ రకాల సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్యులతో తనిఖీలు చేపట్టి అవసరమైన వారికి మందులు పంపిణీ చేయనున్నాం. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ వెంకటరమణ, జిల్లా వైద్యాధికారి, నంద్యాల

హరిత విప్లవ పితామహుడు స్వామినాథన్



ఎస్.స్వామినాథన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపకులపతి డా.శారద జయలక్ష్మి

నంద్యాల(సెంట్రల్): హరిత విప్లవ సాకారానికి పునాది వేసిన మహనీయుడు ఎం.ఎస్.స్వామినాథన్ అని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డా.ఆర్.శారద జయలక్ష్మి కొనియాడారు. శుక్రవారం స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం(ఆర్‌ఏఆర్‌ఎస్)లో ఎం.ఎస్.స్వామినాథన్ సంస్మరణ సభ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ...ఇతర దేశాలకు చెందిన ఎన్నో మేలైన వరి వంగడాలను దేశానికి పరిచయం చేసి కొత్త రకాలను ఉత్పత్తి చేసేందుకు కృషి చేశారన్నారు. ఐపీఎస్‌కు ఎంపికైనా వ్యవసాయం మీద మక్కువతో ఈ రంగంలో పరిశోధనలకు పూనుకున్నారని అన్నారు. ఒకప్పుడు ఆహార ధాన్యాలంటేనే దిగుమతులే శరణ్యమైన పరిస్థితి నుంచి లక్షల టన్నుల ధాన్యాన్ని ఎగుమతి చేసే స్థాయికి దేశం ఎదగడంలో స్వామినాథన్ కృషి వెలకట్టలేనిదని కీర్తించారు. కార్యక్రమంలో పరిశోధనా స్థానం సహ సంచాలకులు ఎస్.సి.వెంకటేశ్వర్లు, కార్యక్రమ సమన్వయకర్త డా.ఎస్.సరళమ్మ, బోధన, బోధనేతర సిబ్బంది, పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు పాల్గొని నివాళులర్పించారు.

వదలని వర్షం



బిజనవేముల వద్ద కందిపంటలో చేరిన వర్షపు నీరు

- అవుకు మండలంలో 42.2 మి.మీ వర్షపాతం

కోవెలకుంట్ల: స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లో వర్షాలు కొనసాగుతున్నాయి. గురువారం అర్ధరాత్రి ఆయా మండలాల్లో భారీ వర్షం కురిసింది. అవుకు మండలంలో అత్యధికంగా 42.2 మి.మీ వర్షపాతం నమోదైంది. భారీ వర్షం కారణంగా ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగు చేసిన మిరప, కంది, మినుము, జొన్న, తదితర పంటల్లో వర్షపు నీరు చేరింది. ఈ వర్షాలు ఖరీఫ్ పంటలకు ఊరటనివ్వగా.. అక్టోబర్ 1వ తేదీ నుంచి ప్రారంభం కానున్న రబీ పంటలకు అనుకూలంగా మారడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

దేవదాయ శాఖ రికార్డ్ అసిస్టెంట్‌పై కేసు నమోదు

కర్నూలు: దేవదాయ శాఖలో రికార్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సాయిచరణ్‌పై నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైంది. వీరభద్ర ఆలయం, భీమేశ్వర ఆలయం, రూపాల సంగమేశ్వర ఆలయం, వెంకటేశ్వర ఆలయాలకు కార్యనిర్వహణాధికారిగా ప్రసన్నలక్ష్మి పనిచేస్తున్నారు. ఆమె దగ్గర రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సాయిచరణ్ ప్రసన్నలక్ష్మి సంతకాన్ని ఫోర్జరీ చేసి మూడు వేర్వేరు బ్యాంకు ఖాతాల నుంచి రూ.5.8 లక్షలు స్వాహా చేశాడు. అలాగే ఆలయ భూముల గుత్త డబ్బులకు సంబంధించి కూడా మరో రూ.లక్ష కాజేశాడు. ఆయా ఆలయాలకు సంబంధించి ఆడిట్ ఉన్నందున కార్యనిర్వహణాధికారి ప్రసన్నలక్ష్మి వారం రోజులుగా మొత్తం రికార్డులను పరిశీలించగా డబ్బు స్వాహా బాగోతం బయటపడింది. దీంతో సాయిచరణ్‌ను సస్పెండ్ చేస్తూ మూడు రోజుల క్రితమే ప్రసన్నలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. అయితే పెద్ద మొత్తంలో డబ్బులు స్వాహా చేసినందున నాల్గవ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి పూర్వాపరాలపై విచారణ జరుపుతున్నట్లు సమాచారం.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

- జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య



మాట్లాడుతున్న జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు కల్చరల్: పంటలు వేసిన ప్రతి రైతు ఈ క్రాప్ నమోదు తప్పనిసరిగా చేసుకునేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య వ్యవసాయ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి రెవెన్యూ అంశాలపై జిల్లాలోని డివిజన్ స్థాయి, మండల స్థాయి, తహసీల్దార్లతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఈ క్రాప్ బుకింగ్ చేసిన తరువాత వీఆర్‌ఓల లాగిన్‌కు రాగానే వెంటనే ఈకేవైసీ చేయాలని ఆదేశించారు. ఇందులో పురోగతి చాలా తక్కువగా ఉందన్నారు. జిల్లాలో 1,700 మంది కౌలు రైతులను గుర్తించడం జరిగిందని అందులో 327 మంది రైతులకు రుణాలు కూడా ఇప్పించడం జరిగిందన్నారు. మిగిలిన వారికి కూడా బ్యాంకర్స్‌తో మాట్లాడి రుణాలు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అసైన్మెంట్ భూములకు సంబంధించి వెరిఫికేషన్ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఇనాము భూములకు సంబంధించి ఆదోని, కర్నూలు పత్తికొండ డివిజన్లలో వెరిఫికేషన్ త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మధుసూదన్ రావు, ఆర్‌డీఓలు, వ్యవసాయ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అమ్మకు మానని గాయం



బిడ్డకు జన్మనిచ్చి మాతృత్వం పొందడం మహిళ అదృష్టంగా భావిస్తోంది. ప్రసవం ఆమెకు పునర్జన్మతో సమానం. ఒకప్పుడు అత్యధిక ప్రసవాలు సాధారణ పద్ధతిలోనే జరిగేవి. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. పలు కార్పొరేట్, ప్రైవేటు ఆసుపత్రులు దోపిడీకి సిజేరియన్లను మార్గంగా చూడటం.. తల్లీబిడ్డా క్షేమంగా ఉండాలని కొందరు కుటుంబీకులు ఆపరేషన్లకు సరే అనడం.. మరి కొందరు శుభఘడియలు అంటూ కడుపు కోతకు ఒత్తిడి తేవడం.. ఇలా కారణాలు ఏవైనా అమ్మ కడుపుపై మానని గాయం ఏర్పడుతోంది. సిజేరియన్లతో భవిష్యత్‌లో అనారోగ్య సమస్యలు ఎదుర్కొవాల్సి వస్తుందని వైద్యాధికారులు హెచ్చరిస్తున్నా పరిస్థితి మారడం లేదు.

- ప్రైవేటు ఆసుపత్రుల్లో ఇష్టారాజ్యంగా సిజేరియన్లు
- కాసుల కక్కుర్తితో అత్యవసరం కాకపోయినా కడుపు కోత
- 50 శాతం పైగానే సిజేరియన్లు
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలు అధికం



నంద్యాల ప్రభుత్వాస్పత్రిలోని గైనకాలజీ వార్డు



జిల్లాలో ఈ ఏడాది ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో ప్రసవాల వివరాలు

నెల	ప్రభుత్వ	ప్రైవేటు
ఏప్రిల్	762	1,121
మే	814	1,051
జూన్	800	1,064
జులై	798	1,057
ఆగస్ట్	860	1,108
సెప్టెంబర్ (21 తేదీ వరకు)	716	651

సాక్షి, నంద్యాల: ధనార్జనే లక్ష్యంగా పలు ప్రైవేటు ఆసుపత్రుల్లో గర్భిణులకు ఇష్టానుసారంగా సిజేరియన్లు చేసి దోపిడీకి పాల్పడుతున్నారు. సాధారణ ప్రసవాలకు అవకాశం ఇవ్వకుండా సిజేరియన్లు ఎక్కువ మొగ్గు చూపుతున్నారు. గర్భంలో బిడ్డ అడ్డం తిరగడం వంటి అత్యవసర సమయాల్లో చేయాల్సిన ఆపరేషన్లను కాసుల కోసం అమ్మకు కడుపు కోత పెడుతున్నారు. సిజేరియన్లతో ప్రసవాలు జరగడంతో చిన్న వయస్సులోనే అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నా పట్టించుకోవడం లేదు. గర్భం దాలిస్తే సిజేరియన్ తప్పనిసరి అన్నట్లు పరిస్థితి మార్చేశారు. గర్భం దాల్చిన రెండో నెల నుంచే అవసరం లేకపోయినా స్కానింగ్‌లు, టెస్టులు, మందులు, టానిక్‌ల పేరుతో రూ.వేలకు వేలు దోపిడీ చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. నంద్యాల జిల్లా వ్యాప్తంగా దాదాపు 79 ప్రైవేటు ఆస్పత్రులున్నాయి. వీటిలో శస్త్రచికిత్సలు చేసే హాస్పిటళ్లు సుమారు 35 వరకు ఉన్నాయి. అలాగే కమ్యూనిటీ హెల్త్ సెంటర్స్ (సీహెచ్‌సీ)లు 11, డోన్, బనగానపల్లెలో ఏరియా ఆస్పత్రి, నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి ఉన్నాయి. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో నెలకు సుమారు 2 వేలకు పైగా ప్రసవాలు జరుగుతున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనల ప్రకారం ఏ ప్రాంతంలోనైనా ప్రసవాల్లో సిజేరియన్లు గరిష్ఠంగా 15 శాతం మించకూడదు. కాన్పు కష్టమైన సమయాల్లో, తల్లీబిడ్డల్లో ఎవరికైనా ప్రాణహాని ఉండే సందర్భాల్లోనే సిజేరియన్ చేయాలి. రక్తహీనత, అధిక రక్తస్రావం జరిగే అవకాశం ఉన్నప్పుడే ఆపరేషన్‌కు మొగ్గు చూపాలి. అయితే ప్రైవేటు ఆసుపత్రుల దోపిడీ, కొందరు కుటుంబీకులు మూఢ నమ్మకాలు వెరసి సిజేరియన్లు ఎక్కువగా జరుగుతున్నాయి. ప్రైవేటు ఆసుపత్రుల్లో జరిగే ప్రసవాల్లో 50 శాతానికి పైగా కడుపు కోత ఉంటున్నాయి.

విస్తుగొల్పుతున్న గణాంకాలు

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఏప్రిల్ నుంచి ఈనెల 21వ తేదీ వరకు మొత్తం 10,086 ప్రసవాలు జరిగాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో 4,034, ప్రైవేటు ఆస్పత్రుల్లో 6,052 ప్రసవాలు నమోదయ్యాయి. జిల్లా వ్యాప్తంగా జరిగిన ప్రసవాల్లో దాదాపు 45 శాతం ప్రసవాలు సిజేరియన్ ద్వారానే జరిగాయి. ఇందులోనూ ప్రైవేటు ఆస్పత్రుల్లో ఇష్టారాజ్యంగా ఆపరేషన్లు జరుగుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. ప్రైవేటు ఆస్పత్రుల్లో 6,052 ప్రసవాలు జరిగితే వీటిలో 50 శాతం అంటే 3 వేలకు పైగా ప్రసవాలు సిజేరియన్ ద్వారా చేయడం విస్తుపోయే వాస్తవం. గర్భం దాల్చినప్పుటి నుంచి సాధారణ ప్రసవం కావాలని ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లే సరికే ఏదో కారణంతో భయపెట్టి సిజేరియన్ చేయిస్తున్నారని కొందరు ఆరోపిస్తున్నారు.

ఒక్కో ఆపరేషన్‌కు వేలల్లో ఖర్చు..!

సాధారణ ప్రసవం జరిగితే ప్రైవేటు ఆస్పత్రుల్లో రూ.10 వేలకు మించి బిల్లు కాదు. అదే సిజేరియన్ అయితే పేషంట్ పరిస్థితిని బట్టి, ఆస్పత్రిని బట్టి రేట్లు నిర్ణయిస్తున్నారు. సిజేరియన్‌కు కనిష్ఠంగా రూ.40 వేల నుంచి గరిష్ఠంగా రూ. 80 వేల వరకు కూడా బిల్లులు వేస్తున్నారు. నంద్యాల పట్టణంలోని ఐదు ప్రముఖ ఆస్పత్రుల్లో, ఆళ్లగడ్డలోని రెండు ఆస్పత్రుల్లో సిజేరియన్లు యథేచ్ఛగా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అయితే ప్రభుత్వ ఆసుపత్రులోని వైద్య సిబ్బంది సాధారణ ప్రసవాలు చేసేందుకు చొరవ చూపుతున్నారు. ఈ క్రమంలో అవగాహన ఉన్న పలువురు ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్తున్నారు. ప్యాపిలి, పాములపాడు, చాగలమర్రి, అహోబిలం.. తదితర మండలాల్లో సాధారణ ప్రసవాలు అధికంగా జరుగుతున్నాయి.

ముహూర్తాలు చూసుకుని మరీ..

ఇటీవల కాలంలో ముహూర్తం, శుభ ఘడియలు చూసుకుని మరీ ప్రసవాలు చేయించుకుంటున్న వారి సంఖ్య పెరుగుతోంది. ఇలాంటి వారంతా ప్రైవేటు ఆస్పత్రులనే ఆశ్రయిస్తున్నారు. ఫలానా రోజు, తేదీ, గంటలు, నిమిషాలను కూడా పాటిస్తూ పిల్లల్ని కనడానికి ఆసక్తి కనబరుస్తున్నారు. మరికొందరైతే బిడ్డ ఎన్ని సెకండ్లకు బయటకు రావాలో కూడా నిర్ణయించేస్తున్నారు. మరికొందరు గర్భిణులు పురిటి నొప్పులు భరించలేక సిజేరియన్ల వైపు వెళ్తున్నారు.

మొదటి నుంచి పరీక్షలు చేయించుకోవాలి



గర్భందాల్చినప్పటి నుంచి పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి. ప్రతి నెల బేబీ గ్రోత్ ఎలా ఉందో తెలుసుకుంటూ ఉండాలి. సాధారణ ప్రసవమైతే రెండు వారాలు విశ్రాంతి తీసుకుంటే సరిపోతుంది. సిజేరియన్ అయితే కనీసం మూడు నెలల విశ్రాంతి అవసరం. జీవనశైలిలో వచ్చే మార్పుల వల్లే ఆపరేషన్లు పెరిగిపోతున్నాయి.

– డాక్టర్ అనూష గింజుపల్లి, గైనకాలజిస్ట్

అవగాహన కల్పిస్తున్నాం



సిజేరియన్ల శాతం తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధ్యమైనంత వరకు సాధారణ ప్రసవాలు జరిగేలా చేస్తున్నాం. కేవలం హై రిస్క్ ఉన్న వారిని మాత్రమే సిజేరియన్లకు రెఫర్ చేస్తున్నారు. బిడ్డ పుట్టిన సమయమే శుభ ఘడియలు. ప్రత్యేక తేదీలు, ప్రముఖల జన్మదిన రోజులు అంటూ డాక్టర్లపై ఒత్తిడి చేయకూడదు.

– డాక్టర్ వెంకటరమణ, జిల్లా వైద్యాధికారి

అతివేగానికి నిండు ప్రాణం బలి

- బొలేరో వాహనం బోల్తాపడి ఒకరు దుర్మరణం
- మరో ఇద్దరికి గాయాలు



ప్రమాదానికి గురైన బొలేరో వాహనం

ఓర్వకల్లు: వాహన డ్రైవర్ అతివేగానికి ఓ నిండు ప్రాణం బలైంది. గురువారం రాత్రి కర్నూలు – చిత్తూరు జాతీయ రహదారిపై బొలేరో వాహనం బోల్తాపడి ఒకరు దుర్మరణం చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడిన దుర్ఘటన ఓర్వకల్లు సమీపంలోని హెచ్. కొట్టాల బస్సు స్టేజీ వద్ద చోటుచేసుకొంది. మండల పరిధిలోని గుమ్మితం తండా వద్ద ఉన్న గ్రీన్‌కో సంస్థ ఆధ్వర్యంలో బహులార్థక విద్యుత్ ఉత్పాదకత పరిశ్రమలో శ్రీకాంత్, అబ్దుల్లా, లంకా శ్రీనివాసులు(35) అనే యువకులు ఉద్యోగం చేస్తున్నారు. వీరు వారానికి ఒకసారి సిఫ్ట్ డూటీ చేసేవారు. ఈ క్రమంలో గురువారం కర్నూలు నుంచి డ్రైవర్ వెంకటనాయుడి బొలేరో వాహనంలో రాత్రి విధుల నిమిత్తం బయలుదేరారు. మార్గమధ్యలో ముందు వెళ్లుతున్న లారీని అధిగమించే క్రమంలో బొలేరో వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని పల్టీలు కొట్టింది. ఈ సంఘటనలో లంకా శ్రీనివాసులు తల తెగిపోయి కొంత దూరం వరకు ఈడ్చుకపోవడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. వాహనంలోని శ్రీకాంత్, అబ్దుల్లా తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను 108లో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతి చెందిన లంకా శ్రీనివాసులుది కృష్ణా జిల్లా వక్కగడ్డ మండలం కమతా గూడెం కాగా ప్రస్తుతం ఉద్యోగం రీత్యా ఏడాది నుంచి ఓర్వకల్లులో ఇళ్లు అద్దెకు తీసుకొని నివసిస్తున్నాడు. మృతునికి భార్య వాణితో పాటు ఇద్దరు సంతానం ఉన్నట్లు పోలీసులు తెలిపారు. క్షతగ్రాతుడు శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రాజారెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అధికారం మాటున చంద్రబాబు అడ్డగోలు దోపిడీ

- విలేకరుల సమావేశంలో వైఎస్‌ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రామయ్య



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్‌ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రామయ్య

కర్నూలు(రాజ్‌విహార్): అధికారాన్ని అడ్డు పెట్టుకొని చంద్రబాబు రూ.లక్షల కోట్లు దోచుకున్నారని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య విమర్శించారు. శుక్రవారం సాయంత్రం స్థానిక బిర్లా కాంపౌండ్ వద్ద ఉన్న పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ సోషల్ మీడియా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అక్రమ సంపాదనలో బాబును మించిన నాయకుడు లేరన్నారు. అన్ని సాక్ష్యాలతోనే కేసు నమోదు చేసిన సీఐడీ అధికారులు జైలుకు పంపారని పేర్కొన్నారు. చంద్రబాబు అరెస్ట్ అంటూ అక్రమమని టీడీపీ నేతలు, ఎల్లో మీడియా, పవన్ కళ్యాణ్ తప్ప ఇతర సామాన్య ప్రజలు ఏ ఒక్కరూ ముందుకు రావడం లేదని చెప్పారు. పవన్ కూడా తనకు రావాల్సిన కమిట్‌మెంట్స్ కోసం వెళ్లి కలిసి వచ్చారని వెల్లడించారు. ఆందోళన శిబిరాలకు ఐదారుగురు పార్టీ కార్యకర్తలు బలవంతంగా వస్తున్నారని, ఎల్లో మీడియా ప్రభుత్వంపై చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు సోషల్ మీడియా కీలకంగా పనిచేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లి విస్తృత ప్రచారం చేయాలని, ప్రతి పేదింటికి మంచి చేయాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. అందుకే నవరత్నాల పేరుతో సంక్షేమ పథకాలు తీసుకొచ్చినట్లు చెప్పారు. సీఎం జగన్ ఇచ్చిన హామీలను 98 శాతం అమలు చేయడంతో 80 శాతం మంది సంతృప్తికరంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రజలకు మేలు చేస్తున్న ప్రభుత్వం, లక్ష్యాలను వివరించాలన్నారు. ఎన్నికల సమీపిస్తుండడంతో మరింత కీలకంగా పని చేసి వచ్చే ఎన్నికల్లో 175 స్థానాల్లో గెలుపు కోసం పని చేయాలన్నారు. ఈ సమావేశంలో సోషల్ మీడియా జిల్లా కో ఆర్డినేటర్ ఇంద్ర సేనారెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్‌ను బలోపేతం చేద్దాం

- పార్టీ లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ ఎం.ప్రభాకర్

కర్నూలు (లీగల్): జిల్లాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్‌ను బలోపేతం చేద్దామని ఆ విభాగం జోనల్ ఇన్‌చార్జి మిరపకాయల ప్రభాకర్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఎమ్మిగనూరు, ఆలూరు, పత్తికొండ న్యాయవాదులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్‌ను బలోపేతం చేసేందుకు ప్రతి న్యాయవాది కృషి చేయాలని నిలుపునిచ్చారు. న్యాయవాదుల సంక్షేమానికి కట్టుబడి ముఖ్యమంత్రి జగనన్న వెల్ఫేర్ ఫండ్ రూ.100 కోట్లు కేటాయించి రూ.25 కోట్లు విడుదల చేయడం జరిగిందని చెప్పారు. లా నేస్తం ద్వారా అంతేకాకుండా ప్రతి జూనియర్ న్యాయవాదికి రూ.5 వేలు చొప్పున మూడు సంవత్సరాలు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా మిరపకాయల ప్రభాకర్‌తో పాటు లీగల్ సెల్ కర్నూలు జిల్లా అధ్యక్షులు పి.సువర్ణారెడ్డిని న్యాయవాదులు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. సమావేశంలో ఎమ్మిగనూరు న్యాయవాదులు, గురురాజారావు, సుధాకర్, దామోదర్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, ఆలూరు న్యాయవాదులు లక్ష్మీకాంతయ్య, నాగరాజు, న్యాయవాదులు ఎల్లారెడ్డి, గోపాల్‌రెడ్డి, రంగస్వామి, నరసింహయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మిగనూరు ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డిని శుక్రవారం వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ నాయకులు ఎం.ప్రభాకర్, పి.సువర్ణారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.

పెండింగ్ కేసులను పూర్తి చేయాలి

కర్నూలు కల్చరల్: అండర్ ఇన్వెస్టిగేషన్‌లోని పెండింగ్ కేసుల పూర్తికి చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ పెండింగ్ కేసులను ఎఫ్ఐఆర్ రిజిస్టర్ చేసి పంపితే రెవెన్యూ శాఖ నుంచి త్వరగా బాధితులకు పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. 2023 సంవత్సరానికి సంబంధించి 42 కేసులకు ప్రపోజల్స్ ఇంకా సెక్షన్‌కు రాలేదన్నారు. మిగిలిన కేసులకు మానిటరీ రిలీఫ్ ఎఫ్ఐఆర్ మీద రూ.7,25,000 అందజేశామన్నారు. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ దిన్నెదేవరపాడు, తాండ్రపాడు, ఓర్వకల్లు, కర్నూలు చుట్టుపక్క ప్రాంతాల్లో రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు ఇచ్చిన డీ-పట్టా భూమిని ఎవరికైనా అమ్మితే అలాంటి స్థలాలను కూడా వారి పేరు మీద రిజిస్ట్రేషన్ చేసి ఇస్తున్నారని, అలాంటివి జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ వెల్దుర్తి మండలం బోయినపల్లి గ్రామంలో మైనర్ బాలికను అత్యాచారం చేశారని, ఆ విషయంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేస్తే ఇంతవరకు న్యాయం జరగలేదన్నారు. అనంతరం అదనపు ఎస్పీ టి.సర్కార్ కేసుల పురోగతిని వివరించారు. సమావేశంలో ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డీఆర్వో మధుసూదన్‌రావు, ఆర్‌డీఓలు హరిప్రసాద్, మోహన్‌దాస్, ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ యుగంధర్ బాబు, కర్నూలు, పత్తికొండ డీఎస్పీలు, ఎస్సీ, ఎస్టీ స్పెషల్ సెషన్స్ కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ స్వాములు, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రంగలక్ష్మి, మ్యానువల్ స్కావెంజర్ కమిటీ మెంబర్ బాబూజీ పాల్గొన్నారు.

నిందితుడి పరారీ

- అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు

బొమ్మలసత్రం: పలు కేసుల్లో నిందితుడు శుక్రవారం ఆళ్లగడ్డ సబ్ కోర్టు ఆవరణ నుంచి పోలీసుల కళ్లుగప్పి పరారీ అయిన సంఘటన చోటు చేసుకుంది. కాగా పోలీసులు వెంటనే అప్రమత్తమై నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. త్రీటౌన్ సీఐ నరసింహులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని బొగ్గులైన్ వీధిలో నివాసముంటున్న పల్ల బాలమద్దిలేటి పలు కేసుల్లో నిందితునిగా ఉన్నాడు. అయితే నంద్యాల జిల్లా కోర్టులో వాయిదాలకు గైర్హాజరు కావడంతో జిల్లా కోర్టు అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. అయితే జిల్లా కోర్టులో జడ్జి శుక్రవారం సెలవులో ఉండటంతో ఆళ్లగడ్డ సబ్‌కోర్టు జడ్జి ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. ఈక్రమంలో నిందితుడు తన న్యాయవాదితో కలిసి ఆళ్లగడ్డ కోర్టుకు వెళ్లి రీకాల్ పిటిషన్‌ను అనుమతించాలని జడ్జిని కోరారు. నిందితుని రీకాల్ పిటిషన్‌ను తిరస్కరించిన జడ్జి వెంటనే 14 రోజుల రిమాండ్ విధించారు. జడ్జి తీర్పుతో బాలమద్దిలేటి కంగుతిని అనారోగ్యంగా ఉందని నాటకం మొదలుపెట్టాడు. ఆసుపత్రికి వెళ్లాలని అక్కడ ఉన్న కోర్టు కానిస్టేబుల్‌కు చెప్పి పరారయ్యాడు. కానిస్టేబుల్ నంద్యాల త్రీటౌన్ సీఐ నరసింహులుకు సమాచారం ఇవ్వడంతో నిందితున్ని అరెస్ట్ చేసి జడ్జి ఎదుట హాజరుపరిచి తిరిగి రిమాండ్‌కు తరలించారు.

1న స్వచ్ఛతా హీ సేవ

నంద్యాల(సెంట్రల్): జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో అక్టోబర్ 1న గోస్ మండలం ఉంగరాణిగుండ్ల చెరువు వద్ద స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా నీటి యాజమాన్య సంస్థ సంచాలకులు రామచంద్రారెడ్డి పేర్కొన్నారు.

మండల స్థాయి స్పందనకు ప్రాధాన్యత

- జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి



అర్జీదారులతో మాట్లాడుతున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

నంద్యాల(అర్బన్): వారంలో ప్రతి బుధ, శుక్రవారాల్లో మండల స్థాయిలో నిర్వహించే 'జగనన్నకు చెబుదాం-స్పందన' కార్యక్రమానికి ప్రాధాన్యత ఇచ్చి అర్జీలను తక్షణ పరిష్కారం చూపుతున్నట్లు జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నంద్యాల మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో వారంలో ప్రతి బుధ, శుక్రవారాలు మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమాలు నిర్వహించి ప్రజల సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మండల స్థాయి స్పందనలో రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖలకు సంబంధించిన దరఖాస్తులు అధికంగా వస్తున్నాయని వీటన్నింటిని నిర్ణీతకాల పరిమితిలోగా పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు జేసీ వివరించారు. నంద్యాల మండల స్థాయి జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో 75 దరఖాస్తులు వచ్చాయని వీటన్నింటిని బియాండ్ ఎస్ఎల్ఏలోగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

రెండు థంబ్‌ల విధానం వద్దు..

ప్రజా పంపిణీ వ్యవస్థలో రెండు వేలిముద్రల విధానంతో రేషన్ పంపిణీ ఆలస్యమవుతుందని, సకాలంలో కార్డు దారులందరికీ రేషన్ పంపిణీని చేయలేకపోతుండటంతో కార్డు దారుల నుంచి వ్యతిరేకత వస్తుందంటూ నంద్యాల జిల్లా ఎండీయూ వాహనదారులు జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకొని వచ్చారు. స్పందించిన జేసీ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పుల్లయ్య, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

వినతుల్లో కొన్ని..

- తన అక్కకు నంద్యాల మండలం పెద్దకొట్టాల గ్రామంలో సర్వే నంబర్ 256లో 1.40 సెంట్ల భూమి ఉందని, ప్రస్తుతం ఆమె చనిపోయిందని సంబంధిత భూమి హైవే రోడ్డుకు కేటాయించారని సంబంధిత పరిహారం మొత్తాన్ని మా బావగారికి చెందకుండా సివిల్ జడ్జి కోర్టులో డిపాజిట్ చేయించాలని కోరుతూ చాగలమర్రి మండలం చిన్న బోధనం గ్రామానికి చెందిన రమణమ్మ జిల్లా జాయింట్ కలెక్టర్‌కు అర్జీ ఇచ్చారు.
- తన భర్త అనారోగ్యం కారణంగా చనిపోయారని, రైస్ కార్డ్ నుంచి ఆయన పేరును తొలగించి, కుమార్తె ఆధార్ నంబర్ సరిచేసి నాకు పెన్షన్ దరఖాస్తు చేసుకునేందుకు సహకరించాలని కోరుతూ నంద్యాల మండలం పెద్ద కొట్టాల గ్రామానికి చెందిన తలారి ఎల్లమ్మ జేసీకి వినతి పత్రం అందజేశారు.

శోభాయమానంగా సీమోల్లంఘన



శ్రీకృష్ణుడి విరాట్‌కు హారతి పడుతున్న పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు

మంత్రాలయం: శ్రీమఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థుల చాతుర్మాస్య దీక్ష సీమోల్లంఘన శోభాయమానంగా సాగింది. మధ్యమత మూల సంస్థానం ఆచారంలో భాగంగా పీఠాధిపతి 11వ చాతుర్మాస్య దీక్షలో మండలం పాటు కొనసాగారు. అనంత చతుర్దశి సంపూర్ణంతో స్వామిజీ చాతుర్మాస్య దీక్ష ముగిసింది. ఈ నేపథ్యంలో శుక్రవారం స్వామిజీ శ్రీమఠంలో ప్రత్యేక పూజోత్సవాలు చేపట్టారు. ఉదయం రాఘవేంద్ర బృందావనంతో చాతుర్మాస్య సమరూప కృతువు నిర్వహించారు. పూజామందిరంలో జయ, దిగ్విజయ, మూలరాములు, నరసింహా మూర్తి, శ్రీహరి, రాయరు బంగారు పాదుక అర్చన అభిషేకాలు నిర్వహించారు. శాస్త్రోక్తంగా జోలోత్సవ మంటపంలో శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు గావించారు. రాత్రి కొండాపురం ఆంజనేయ స్వామి ఆలయం చేరుకుని వాయుదేవునికి విశేష పూజలు కానిచ్చారు. అక్కడ నుంచి సీమోల్లంఘన యాత్ర మొదలు పెట్టారు. 2 కిలోమీటర్లు దూరం నుంచి ప్రత్యేక వాహనంపై పీఠాధిపతిని ఘనంగా ఊరేగించారు. సేవా భక్తులు పురవాసుల నేతృత్వంలో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాల మధ్య ఊరేగింపులో శోభాయమానంగా సాగింది. అనంతరం శ్రీమఠం యోగీంద్ర మంటపం చేరుకుని స్వామిజీని పలువురు పండితులు, ప్రముఖులు ఘనంగా సన్మానించారు. వేడుకలో పండిత కేసరి గిరియాచార్, మేనేజర్లు శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, జోనల్ మేనేజర్ శ్రీపతి ఆచార్, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహా మూర్తి, ఏపీఆర్‌ఓ బిందుమాధవ్, ఎస్‌ఐ వేణుగోపాల్ రాజు పాల్గొన్నారు.